సాక్షి
చిత్తూరు
శుక్రవారం । 8 । నవంబర్ । 2024



వంకలో రోడ్డు ఎలా వేస్తారు..!
వెదురుకుప్పం మండలం మాంబేడు గ్రామ సమీపంలోని వంకలో రోడ్డు వేస్తుండగా గ్రామస్తులు అడ్డుకున్నారు. - 8లో



'పట్టు'కోల్పోతున్నారు..
జిల్లాలోని మల్బరీ రైతులకు ప్రభుత్వం నుంచి పథకాలు, ప్రోత్సాహకాలు అందక తీవ్రంగా నష్టపోతున్నారు. - 8లో



హైకోర్టు ఆదేశించినా..
విధుల్లోకి తీసుకోవాలని హైకోర్టు ఆదేశించినా స్థానిక అధికారులు స్పందించడం లేదని సంఘమిత్రలు నిరసన తెలిపారు. - 8లో

న్యూస్‌రీల్

టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సుకు దరఖాస్తులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లావ్యాప్తంగా అర్హత, ఆసక్తి ఉన్న అభ్యర్థులు టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సుకు దరఖాస్తులు చేసుకోవాలని డీఈఓ వరలక్ష్మి అన్నారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడారు. టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు (లోయర్, హయ్యర్ గ్రేడ్స్) డ్రాయింగ్, హ్యాండ్లూమ్, వీవింగ్ టైలరింగ్, ఎంబ్రాయిడరీ పరీక్షలు జనవరిలో నిర్వహిస్తారన్నారు. లోయర్ గ్రేడ్ పరీక్షకు 7వ తరగతి ఉత్తీర్ణత చెంది ఉండాలని తెలిపారు. హయ్యర్ గ్రేడ్ పరీక్షకు లోయర్ గ్రేడ్ ఉత్తీర్ణత చెంది ఉండాలని చెప్పారు. డ్రాయింగ్ లోయర్ గ్రేడ్‌కు రూ.100, హయ్యర్ గ్రేడ్‌కు రూ.150, హ్యాండ్లూమ్ లోయర్ గ్రేడ్‌కు రూ.150, హయ్యర్ గ్రేడ్‌కు రూ.200, టైలరింగ్, ఎంబ్రాయిడింగ్ (లోయర్‌గ్రేడ్)కు రూ.150, టైలరింగ్, ఎంబ్రాయిడింగ్ (హయ్యర్‌గ్రేడ్)కు రూ.200 ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. అపరాధ రుసుం లేకుండా ఈ నెల 30వ తేదీలోపు, రూ.50 అపరాధ రుసుంతో డిసెంబర్ 10, అపరాధ రుసుం రూ.75తో డిసెంబర్ 13వ తేదీ లోపు ఫీజు చెల్లించేందుకు అవకాశం ఉందని చెప్పారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు www. bre.a p.g-o-v.i n వెబ్‌సైట్‌లో దరఖాస్తులు చేసుకోవాలని డీఈఓ వెల్లడించారు.

ఎంఎస్‌ఎంఈ ఏపీ వైస్ చైర్మన్‌గా శ్రీనివాసులు



కుప్పం: ఎంఎస్‌ఎంఈ ప్రమోషన్ కౌన్సిల్ ఇండియా ఆంధ్రాకు వైస్ చైర్మన్‌గా కుప్పం శ్రీనివాసులును, చైర్మన్‌గా జితేందర్ ఉమాకాంత్ వేగేలా నియమించారు. గురువారం ఏపీ ఎంఎస్‌ఎంఈ వైస్ చైర్మన్‌గా శ్రీనివాసులు నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆంధ్రలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటుకు తనవంతు కృషి చేస్తామని శ్రీనివాసులు తెలిపారు.

శ్రీవారి దర్శనానికి 9 గంటలు



తిరుమల: తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 17 కంపార్ట్‌మెంట్లు నిండాయి. బుధవారం అర్ధరాత్రి వరకు 66,163 మంది స్వామివారిని దర్శించుకోగా 25,299 మంది తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ. 4.23 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే, దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 9 గంటల్లో, ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనం లభిస్తోంది. ఇదిలా ఉంటే సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలలో వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది.

కొత్త పింఛన్ ఎప్పుడిస్తారు ?



ఎన్నికలప్పుడు చంద్రబాబు ఇచ్చే హామీలను నమ్మి ఓటేస్తే అధికారం చేపట్టాక వాటిని, ఓట్లేసిన ప్రజలను గాలికొదిలేయడం గత మూడు దశాబ్దాలుగా చూస్తూనే ఉన్నాం. దీనికి భిన్నంగా ఈసారి మూడు పార్టీలు కూటమిగా ఏర్పడి ఈ ఏడాది జరిగిన ఎన్నికల్లో సూపర్‌సిక్స్ అంటూ కొత్తరాగం అందుకున్నారు. అధికారం చేపట్టి 5 నెలలు దాటుతున్న ఏ పథకం అమలులోనూ క్లారిటీ ఉండట్లేదు. హంగూ ఆర్భాటాలు తప్పా. గత ప్రభుత్వంలో ఇస్తున్న పింఛన్లనే కూటమి సీఎం ప్రతి నెలా రాష్ట్రంలోని ఏదో మూలకు పంపిణీ చేస్తూ ఆర్భాటం చేస్తున్నారు. మరి కొత్త పింఛన్లు ఎప్పుడిస్తారు సారూ.. అంటే మాత్రం సమాధానం లేదు.

- జిల్లావ్యాప్తంగా పింఛన్ల కోసం 3.5 లక్షల మంది పండుటాకుల ఎదురుచూపులు
- తమకు ఓటెయ్యలేదనే కక్షతో పలువురి పింఛన్లు తొలగించిన కూటమి నేతలు
- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు 50 ఏళ్లకే పింఛన్ ఇస్తామన్న హామీ గాలికే..!
- దరఖాస్తు ఆన్‌లైన్ చేయకుండా సైట్ క్లోజ్
- మండల, కలెక్టర్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న వృద్ధులు
- గత వైఎస్సార్‌సీపీ పాలనలో ఏటా కొత్త పింఛన్లకు అవకాశం
- అధికారం కోసం అబద్ధపు హామీలు గుప్పించిన చంద్రబాబు
- అందలం ఎక్కాక పేదలను గాలికొదిలేస్తున్న సర్కారు

చిత్తూరు కలెక్టరేట్ : కొత్త పింఛన్లు ఎప్పుడు మంజూరు చేస్తారా ? అని లక్షలాది మంది అర్హులు నిరీక్షిస్తున్నారు. పింఛన్లు మంజూరు చేయాలని ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో విన్నవించేందుకు వృద్ధులు కాళ్లరిగేలా తిరుగుతున్నారు. ఉన్నతాధికారులకు ప్రతివారం వినతులు సమర్పిస్తున్నారు. అలాగే ఈ ఏడాది జరిగిన ఎన్నికల్లో 50 ఏళ్లు నిండిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు వృద్ధాప్య పింఛన్ ఇస్తామన్న హామీ అమలుపై సర్కారు పట్టించుకోవడం లేదు. వేలమంది అర్హులు పింఛన్ అందక నష్టపోతున్నా ప్రభుత్వానికి పట్టట్లేదు. దీనికితోడు ఎన్నికల్లో తమకు ఓటెయ్యలేదన్న కారణంతో కొంతమంది పండుటాకుల పింఛన్లను నిర్దాక్షిణ్యంగా పీకేసి తమ రాక్షసత్వాన్ని చూపుతున్నారు.

గత ప్రభుత్వంలో ఏటా కొత్త పింఛన్లు

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ పాలనలో ఏటా జనవరి, జూలై నెలల్లో అర్హులైన వారికి కొత్త పింఛన్లు మంజూరు చేసేవారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకుంటే చాలు సిబ్బంది వాటిని ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసేవారు. రాజకీయాలు, కులమతాలకు అతీతంగా, పేదరికమే ప్రామాణికంగా లబ్ధిదారులను ఎంపిక చేసేవారు. ఈ ఏడాది జనవరిలో జిల్లాలో 5,856 కొత్త పింఛన్లు సైతం మంజూరు చేశారు. కొత్త పింఛన్లు కోరుతూ జూన్ నాటికి దాదాపు 7,458 దరఖాస్తులు ఆన్‌లైన్ కాగా జూలైలో కొత్తవి మంజూరు కావాల్సి ఉంది. కూటమి ప్రభుత్వం వచ్చాక ఆ సైట్‌ను క్లోజ్ చేయడంతో ఇవి మరుగునపడిపోయాయి. దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియ నిలిచిపోయింది. మండల, జిల్లాస్థాయిలో నిర్వహిస్తున్న మీకోసం కార్యక్రమంలో పింఛన్ సాయం కోసం పేదలు దరఖాస్తు చేసుకుంటున్నారు. వివిధ సామాజిక పింఛన్ల కోసం గత ఐదు నెలల్లో జిల్లావ్యాప్తంగా 18 వేల వరకు దరఖాస్తులు వచ్చాయి. వీరంతా సచివాలయాలు, ఎంపీడీఓ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తుండగా ప్రభుత్వం నుంచి తమకు ఇంకా మార్గదర్శకాలు రాలేదని ఉద్యోగులు వారిని వెనక్కి పంపిస్తున్నారు. సైట్ ఓపెన్ కాక దరఖాస్తులను ఆన్‌లైన్ చేసే వీలులేకపోవడంతో ఎన్నో వ్యయ ప్రయాసలకు ఓర్చి పేదలు అందజేస్తున్న ఆ అర్జీలు ఏమవుతున్నాయో అంతుతెలియని పరిస్థితి నెలకొంది. పైగా కొత్తవి ఇవ్వకపోగా ఉన్నవాటికే కోత పెడుతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చే నాటికి జిల్లాలో పింఛన్ లబ్ధిదారులు 2,71,253 ఉండగా నవంబరు నాటికి ఆ సంఖ్య 2,67,583కు తగ్గింది.



ఇచ్చిన హామీ అమలెప్పుడు సారూ ?

జిల్లాలో 50 ఏళ్లు నిండిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు వృద్ధాప్య పింఛన్లు అందజేస్తామని చంద్రబాబు గత ఎన్నికల్లో హామీ ఇచ్చారు. ప్రతి ఎన్నికల్లో హామీలు గుప్పించడం, అధికారంలోకి వచ్చాక ఆ హామీలను తుంగలో తొక్కడం చంద్రబాబుకు అలవాటే. 50 ఏళ్లు నిండిన వారికి ఇచ్చే పింఛన్ల అంశాన్ని గత ఎన్నికల ప్రచారంలో కూటమి నేతలు విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లారు. జిల్లాలో 50 నుంచి 60 ఏళ్ల లోపు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు దాదాపు 3.5 లక్షల మంది వరకు ఉండగా వారిలో 70 శాతం మంది అర్హులు ఉంటారని అంచనా. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఐదు నెలలు కాగా ఇప్పటి వరకు ఎన్నికల హామీ అమలు గురించి పట్టించుకోవడం లేదు.

ప్రతి నెలా ఆర్భాటం

జిల్లావ్యాప్తంగా ప్రతి నెలా ఒకటో తేదీన అందజేసే పింఛన్ల పంపిణీలో కూటమి నేతలు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారు. కొత్త పథకాలు ప్రవేశపెట్టే సమయంలో ప్రజాప్రతినిధులు, అధికార పక్షం నాయకులు హాజరై లాంఛనంగా ప్రారంభించడం పరిపాటి. కానీ కూటమి సర్కారు తీరు ఇందుకు భిన్నంగా ఉంది. ప్రతి నెలా పింఛన్ల పంపిణీలో ఆర్భాటం చేస్తున్నారు. అందుకోసం రూ.కోట్లు దొంగ లెక్కలు చూపించి ప్రజాధనాన్ని కాజేస్తున్నారు. సచివాలయ సిబ్బంది వెంట పింఛన్ పంచేందుకు వెళ్తున్న కూటమి నేతలను కొత్త పింఛన్లు ఎప్పుడిస్తారని ప్రజలు ప్రశ్నిస్తుంటే మెల్లగా జారుకుంటున్నారు.

అర్హత ఉన్నా పింఛన్ ఇవ్వడం లేదు



మాది గంగాధరనెల్లూరు మండలం జూపల్లి. నాకు అంగవైకల్యం ఉంది. వృద్ధాప్యం మీద పడుతోంది. 63 శాతం అంగవైకల్యం ఉన్నట్లు ధ్రువీకరణ పత్రం కూడా ఉంది. దివ్యాంగుల పింఛన్‌కు దరఖాస్తు చేసుకోవాలని గత నెల 28వ తేదీన కలెక్టర్ ఆఫీసులో అర్జీ ఇచ్చాను. కొత్త పింఛన్లకు అవకాశం ఎప్పుడు ఇస్తారో ఎవరూ సమాధానం చెప్పడం లేదు.

– విమల, దివ్యాంగురాలు, జీడీనెల్లూరు మండలం

ఆఫీసుల చుట్టూ తిరిగినా..!



మాది బైరెడ్డిపల్లి మండలం బేలుపల్లి. నాకు 28 ఏళ్లు. పూర్తి అంగవైకల్యం ఉండడం వల్ల నడవలేను. ఉపాధి కూడా లేదు. పూర్తి అంగవైకల్యం ఉంటే ప్రభుత్వం ప్రతి నెల రూ.15 వేలు పింఛన్ అందిస్తుంది. అది కూడా రాదు నాకు. ఎన్నిసార్లు ఆఫీసుల చుట్టూ తిరిగినా సరిగా సమాధానం చెప్పడం లేదు. కలెక్టరేట్‌లో కూడా దరఖాస్తు ఇచ్చాను.

– లక్ష్మప్ప, దివ్యాంగుడు, బైరెడ్డిపల్లి మండలం.

కలెక్టర్ సారుకు అర్జీ ఇచ్చినా..!



మాది తవణంపల్లి మండలం కుయ్యవంక ఎస్టీ కాలనీ. వృద్ధాప్య పింఛన్ కోసం గత ఐదు నెలలుగా ఎదురు చూస్తున్నా. మండల అధికారుల వద్దకు వెళ్లి అడిగితే నోరు మెదపడం లేదు. జిల్లా కలెక్టర్ సారుకు కూడా అర్జీ ఇచ్చాను. ఇంతవరకు నాకు న్యాయం చేయడం లేదు. కొత్త పింఛన్‌కు దరఖాస్తు చేయించి వృధాప్య పింఛన్ ఇప్పించాలని కోరుతున్నా.

– గంగులమ్మ, వృద్ధురాలు, తవణంపల్లి మండలం

ఎన్నేళ్లు తిరగాలో..?



మాది కార్వేటినగరం మండలం సుద్ధగుంట గ్రామం. నా వయస్సు 80 ఏళ్లు. నాకు ఐదు నెలలకు ముందు వృద్ధాప్య పింఛన్ వచ్చేది. ఉన్నట్టుండి ఆపేశారు. ఎందుకు ఇవ్వడం లేదని మండల అధికారులను కలిసి చాలాసార్లు అడిగాను. వారు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. నా వృద్ధాప్య పింఛన్ కోసం ఇంకెన్నేళ్లు తిరగాలో ?

– మునెమ్మ, వృద్ధురాలు, కార్వేటినగరం

అధిక సంఖ్యలో ఉచిత గ్యాస్ బుకింగ్ చేయొద్దు

- మీడియా సమావేశంలో జేసీ విద్యాధరి వెల్లడి

చిత్తూరు కలెక్టరేట్: జిల్లాలో ఒకేసారి అధిక సంఖ్యలో ఉచిత గ్యాస్ బుకింగ్‌లు చేయకూడదని జాయింట్ కలెక్టర్ విద్యాధరి అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని ఆమె విలేకరుల సమావేశం నిర్వహించారు. జిల్లాలో దీపం పథకంలో ఉచిత గ్యాస్ సిలిండర్ పొందేందుకు తెల్లరేషన్‌కార్డు, ఆధార్ కార్డు, వర్కింగ్ కనెక్షన్ ఉన్న లబ్ధిదారులు అర్హులన్నారు. జిల్లాలో దీపం పథకానికి అర్హుల జాబితాను మండల, జిల్లా స్థాయిలో ఎవరూ సిద్ధం చేయరని స్పష్టం చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పథకం అమలవుతుందని తెలిపారు. గ్యాస్ బుక్ చేసే సమయంలో లబ్ధిదారుడు మొదట నగదు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఆ తర్వాత 48 గంటల లోపు ప్రభుత్వం తరపున లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో సిలిండర్‌కు చెల్లించిన మొత్తం సబ్సిడీ రూపంలో జమ అవుతుందన్నారు. ఉచిత సిలిండర్ 2025 మార్చి 31 వరకు బుక్ చేసుకునేందుకు వెసులుబాటు ఉందన్నారు. ప్రజలు ఆందోళన చెంది ఒకేసారి గ్యాస్ బుకింగ్ చేయకూడదని కోరారు. జిల్లాలో ఒకేరోజు 20 వేల నుంచి 30 వేల వరకు గ్యాస్ సిలిండర్ కోసం బుకింగ్‌లు చేస్తున్నట్లు తెలిపారు. ఇంట్లో సిలిండర్ ఉన్నప్పుడే ముందస్తుగా మరో సిలిండర్ బుక్ చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. జిల్లాలో ఉచిత గ్యాస్ సమస్యలు ఉన్నట్‌లైతే ప్రజలు టోల్ ఫ్రీ నంబర్ 1967కు తెలియజేయాలని జేసీ తెలిపారు. లిఖిత పూర్వక ఫిర్యాదులు ఉంటే సచివాలయం, తహసీల్దార్, సోమవారం కలెక్టరేట్‌లో జరిగే గ్రీవెన్స్‌లో ఇవ్వొచ్చన్నారు. జిల్లావ్యాప్తంగా తెల్లరేషన్‌కార్డు లబ్ధిదారులు 5,43,202 మంది, ఎల్‌పీజీ యాక్టివ్ గ్యాస్ కనెక్షన్లు ఉన్న లబ్ధిదారులు 5,80,297 మంది ఉన్నట్లు వివరించారు. జిల్లావ్యాప్తంగా దీపం–2 సబ్సిడీ గ్యాస్‌కు ఇప్పటి వరకు 1,11,165 మంది బుక్ చేసుకున్నట్లు చెప్పారు. ఇందులో 64,759 మందికి గ్యాస్ సిలిండర్లు చేర్చినట్లు తెలిపారు. 22101 మందికి సబ్సిడీ ఇవ్వాల్సి ఉండగా ఇప్పటి వరకు ఒక్కో లబ్ధిదారుడికి రూ.837 చొప్పున 10,994 మందికి సబ్సిడీ నగదు బ్యాంకు ఖాతాల్లో జమ అయిందన్నారు.



మాట్లాడుతున్న జేసీ విద్యాధరి

మాతాశిశు మరణాల
నివారణే లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ

చిత్తూరు రూరల్(కాణిపాకం): మాతా శిశుమరణాల నివారణే లక్ష్యంగా పనిచేయాలని డీఎంఅండ్‌హెచ్‌ఓ ప్రభావతిదేవి అన్నారు. చిత్తూరు నగరంలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో గురువారం లింగ వివక్షత నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మాతా సంరక్షణ సేవలను బలోపేతం చేయాలని సూచించారు. శిశువులలో వ్యాధి నిరోధక శక్తిని పెంపొందించి ప్రాణాంతకరమైన వ్యాధి నిరోధక టీకాలను వేయించాలన్నారు. ప్రధానంగా బాల్య వివాహాలపై దృష్టి సారించాలని, చిన్న తనంలో పెళ్లిళ్లు చేసుకుంటే వచ్చే అనారోగ్య సమస్యలపై అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా లీగల్ సెల్ అథారిటీ అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ హిమబిందు, సీనియర్ అడ్వొకేట్ కుమారిమేరి, వైద్యులు లత, శిరీష, శివ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్‌ను మట్టుపెడదాం

మనుషుల ప్రాణాలను హరించివేస్తున్న మాయదారి క్యాన్సర్‌ను ఆదిలోనే మట్టు పెడదామని డీఎంఅండ్‌హెచ్‌ఓ ప్రభావతిదేవి అన్నారు. చిత్తూరు నగరంలో గురువారం జాతీయ క్యాన్సర్ అవగాహన దిన ర్యాలీ నిర్వహించారు. చిత్తూరు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి నుంచి గాంధీ విగ్రహం వరకు జరిగిన ఈ ర్యాలీని డీఎంఅండ్‌హెచ్‌ఓ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ క్యాన్సర్ నియంత్రణకు ప్రభుత్వాలు ఎన్‌సీడీ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నాయని అన్నారు. ప్రజలు తీసుకునే ఆహారంలోనే జాగ్రత్తలు వహించాలని, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో జిల్లా క్షయ నివారణ అధికారి వెంకటప్రసాద్, సూపరింటెండెంట్ అరుణ్‌కుమార్, సిబ్బంది, అపోలో నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని అమ్మేస్తున్నా..!

ప్రభుత్వ భూముల్లో అక్రమార్కుల కబ్జాల పర్వం కొనసాగిస్తున్నా.. అక్రమ విక్రయాలు, అనధికార భవన నిర్మాణాలు యథేచ్ఛగా జరుగుతున్నా రెవెన్యూ, పంచాయతీ అధికారులకు కనిపించడం లేదు. దీంతో పుత్తూరు మండంలోని మజ్జిగగుంటలో రూ.కోట్ల విలువ చేసే ప్రభుత్వ భూములు, స్థలాలు అక్రమార్కుల పరమవుతున్నాయి.

- పట్టించుకోని రెవెన్యూ అధికారులు
- తిరుపతి– చెన్నై జాతీయ రహదారి పక్కనే ఆక్రమణల పర్వం
- రూ.కోట్ల విలువజేసే ప్రభుత్వ భూమిలో యథేచ్ఛగా ప్లాట్లు, ఇంటి నిర్మాణాలు
- ఉన్నతాధికారులైనా స్పందించాలని కోరుతున్న గ్రామస్తులు



మజ్జిగగుంట వద్ద అక్రమ నిర్మాణాలు

పుత్తూరు: ఎలాంటి అనుమతులు లేకుండా పుత్తూరు మండలంలోని తడుకు రెవెన్యూ మజ్జిగగుంట వద్ద గల ప్రభుత్వ భూముల్లో అక్రమార్కులు ప్లాట్లు వేసి విక్రయిస్తూ రూ.కోట్లు గడిస్తున్నారు. ఆ భూముల్లో స్థలాలు కొన్నవారు పక్కా భవనాలు కట్టి వ్యాపారాలు సాగిస్తున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. సర్వే నంబర్ 6/5, 6/4లోని ఒక ఎకరా భూమి వివిధ రూపాంతరాలు పొంది అక్రమార్కులకు కాసుల పంట పండిస్తోంది.

ఇచ్చిన పట్టాలు రద్దు చేసి..

తిరుపతి–చెన్నై జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న సదరు భూమి రూ.కోట్లు విలువ చేస్తుంది. పాతికేళ్ల కిందట తడుకు గ్రామానికి చెందిన తండ్రీ కొడుకులైన కె.సామయ్య, కె.వెంకటరత్నం ఇద్దరూ చెరో 50 సెంట్లు చొప్పున ఈ భూమిలో డీకేటీ పట్టాలు పొందారు. కొంతకాలం తర్వాత వారు వ్యవసాయం చేయకుండా ప్లాట్లు వేసి విక్రయించడంతో కొందరు రెవెన్యూ శాఖకు ఫిర్యాదు చేశారు. 2005లో దీనిపై విచారణ చేపట్టిన అప్పటి పుత్తూరు తహసీల్దారు కరుణకుమారి వారికి ఇచ్చిన పట్టాలను రద్దు చేసి, ఆ భూమిలో 2008లో ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా తడుకు దళితవాడకు చెందిన అంకమ్మతో పాటు మరికొంతమంది పేదలకు ఇంటి పట్టాలు మంజూరు చేశారు. లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకునే సమయంలో ఈ భూమి తనదేనంటూ వెంకటరత్నం అడ్డుకున్నాడు. దీంతో ఇంటి పట్టాలు ఉన్న కోర్టును ఆశ్రయించగా, కోర్టు సదరు భూమిని రెవెన్యూ శాఖవారు స్వాధీనం చేసుకోవాలని 2017లో ఉత్తర్వులు ఇచ్చింది. అప్పటి నుంచి ఈ భూమిలోకి ఎవరూ వెళ్లలేదు. ఇటీవల కొందరు వ్యక్తులు సదరు భూమిలో ప్రవేశించి ప్లాట్లు వేసి, నిర్మాణాలు చేపడుతున్నారు. ఇలా రూ.కోట్లు విలువ చేసే ప్రభుత్వ భూమి పరులపాలు కావడానికి రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యమే కారణమనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.



2023లో 1బిలో ఫ్రీహ్యాండ్‌గా నమోదు

పూర్తిగా సర్వే చేయాలి..



తడుకు రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 6/5, 6/4లతో పాటు దీని వెనుకభాగంలో ఉన్న ప్రభుత్వ భూమిని పూర్తి స్థాయిలో సర్వే నిర్వహించాలి. ప్రభుత్వ భూమి మొత్తం ప్రభుత్వ అవసరాలకు, పేదల ఇంటి స్థలాలకు కేటాయించాలి. రెవెన్యూ శాఖ నిర్లక్ష్యం కారణంగానే నేడు మళ్లీ ఆక్రమణదారులు సదరు భూమిలోకి ప్రవేశిస్తున్నారు. వెంటనే అధికారులు స్పందించాలి.

– మునికుమార్, తడుకు దళితవాడ, పుత్తూరు మండలం

దళితులకు ఇంటి పట్టాలు ఇవ్వాలి



మజ్జిగ గుంట వద్ద ఉన్న ప్రభుత్వ భూమిలో నిరుపేదలైన దళితులకు ఇంటి పట్టాలు ఇవ్వాలి. గతంలో తడుకు దళితవాడలోని 20 మందికి పైగా ఇంటి స్థలాలు లేవని రెవెన్యూ అధికారులే ప్రభుత్వానికి నివేదించారు. ఇప్పటికైనా పట్టాలు లేనివారికి ఇంటి పట్టాలు కేటాయించాలి.

– కె.గీత, తడుకు దళితవాడ, పుత్తూరు మండలం

రెవెన్యూ అధికారుల బరితెగింపు



కె.సామయ్య పేరిట ఇచ్చిన డీకేటీ పట్టాను 2005లోనే రెవెన్యూ శాఖ రద్దు చేసింది. అతను పదేళ్ల క్రితమే చనిపోయాడు. 2003లో మళ్లీ రద్దు చేసిన భూమిని చనిపోయిన కె.సామయ్య పేరిట 1బిలో అసైన్డ్ ల్యాండ్ ఫ్రీ హ్యాండ్‌గా అప్‌లోడ్ చేయడం రెవెన్యూ అధికారుల బరితెగింపు. ఇలా చేసిన అప్పటి వీఆర్‌ఓ, ఆర్‌ఐ, తహసీల్దార్లను సస్పెండ్ చేయాలి. తడుకు రెవెన్యూ పరిధిలోని ప్రభుత్వ భూమిని సర్వే చేసి అధికారులు స్వాధీనం చేసుకోవాలి.

కె.మురగారెడ్డి, కార్యదర్శి, సమాచార హక్కుల వేదిక, పుత్తూరు.

చర్యలు తీసుకుంటాం



డీకేటీ పట్టా రద్దు చేసి ఉంటే మళ్లీ సదరు వ్యక్తులు అందులో ప్రవేశించడానికి వీలులేదు. ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలు జరుగుతుంటే తక్షణం నిలుపుదల చేస్తాం. సదరు భూమిని క్షేత్ర స్థాయిలో పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటాం.

– జి.సి.వెంకటేశ్వర్లు, తహసీల్దార్, పుత్తూరు

పట్టు కోల్పోతున్నారు

పట్టు పరిశ్రమపై ఆధారపడిన రైతులు పట్టు కోల్పోతున్నారు. ప్రభుత్వం నుంచి తగిన సహకారం లేక.. ప్రోత్సాహకాలు అందక.. ధరలు పరిస్థితి ఎలా ఉంటుందో తెలియక .. రైతులకు ఇవ్వాల్సిన ఇన్సెంటివ్ బకాయిలు అందకపోవడంతో సెరికల్చర్ వ్యవస్థ ఉనికే ప్రశ్నార్థకం అవుతోంది. మరోవైపు రీలర్లకు ఇబ్బందులు తప్పడం లేదు. పొరుగునే ఉన్న కర్ణాటక రాష్ట్రంలో సిల్క్ పరిశ్రమ కళకళలాడుతుంటే ఇక్కడేమో వెలవెలబోతోంది. గతంలో కిరణ్‌కుమార్‌రెడ్డి సర్కార్, ప్రస్తుత సీఎం చంద్రబాబు జిల్లాను సెరికల్చర్ హబ్ చేస్తామన్న మాటలు నీటి మూటలుగానే మిగిలాయి. ఫలితంగా జిల్లాలో మల్బరీ విస్తీర్ణం తగ్గుముఖం పడుతోంది.

పట్టుపురుగులను చంద్రికల్లో వేస్తున్న రైతులు



- కొండెక్కిన పట్టుపరిశ్రమ శాఖ ప్రోత్సాహకాలు
- ఇప్పటికే రైతులకు అందాల్సిన ఇన్సెంటివ్ బకాయిలు రూ.20 కోట్ల వరకు..
- స్టేట్ యూనిట్‌గా మారడంతో పట్టు రైతులకు తప్పని ఇబ్బందులు
- ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం కరువు
- పలమనేరు, మదనపల్లె మార్కెట్లలో మూతబడిన ప్రభుత్వ యూనిట్లు
- జిల్లాను సెరికల్చర్ హబ్ చేస్తామని గతంలో కిరణ్ సర్కారు, ప్రస్తుత సీఎం చంద్రబాబు హామీ
- దశాబ్దాలు గడుస్తున్నా అతీగతీ లేదు
- ఆందోళనలో పట్టుగూళ్ల రైతులు

పలమనేరు: జిల్లాలో పట్టురైతులకు ప్రోత్సాహం అందక.. నాణ్యత లేని సిల్క్ తయారీతో ధరలు కోల్పోయి అగాథంలోకి పడిపోతున్నారు. దానికి తోడు ప్రభుత్వం నుంచి అందాల్సిన ప్రోత్సాహకాలు, పథకాలు సక్రమంగా అమలు కాక సెరికల్చర్‌పై ఆధారపడిన రైతులపై తీవ్ర ప్రభావం పడుతోంది. ఉమ్మడి చిత్తూరు జిల్లాకు సంబంధించి 46 మండలాల్లో మల్బరీ సాగవుతోంది. 2018 దాకా 28 వేల మంది రైతులు 44 వేల ఎకరాల్లో మల్బరీ సాగు చేస్తుండేవారు. ఏటా పంట సాగు తగ్గుతూ వస్తోంది. ప్రస్తుతం 36 వేల ఎకరాల్లో 22 వేల మంది రైతులు మల్బరీని సాగుచేస్తున్నారు. పంటసాగు 8వేల ఎకరాలు తగ్గింది. ఆరువేలమంది రైతులు మల్బరీ సాగును వదిలేశారు.

అందని ప్రోత్సాహకాలు..

గతంలో రైతులు మల్బరీ తోటను సాగు చేయాలంటే ప్లాంటేషన్‌కు 75శాతం రాయితీతో రూ.6750 అందేది. రేరింగ్ షెడ్డుకు యూనిట్ ధర రూ.3 లక్షలుగా అందించేవారు. చాకీసెంటర్ నిర్వాహకులకు రాయితీ వచ్చేది. ప్లాస్టిక్ నేత్రికలను సైతం రైతులకు పంపిణీ చేసేవారు. సిల్క్ ఇండస్ట్రియల్‌కు సంబంధించి 50 శాతం సబ్సిడీ రీలింగ్ యూనిట్లకు అందించేవారు. కానీ ఇవన్నీ గతం. ఇప్పుడు రాష్ట్రాన్ని యూనిట్‌గా చేయడం కారణంగా ఈ పథకాలు ఉన్నప్పటికీ అమలు కష్టమైంది.

ఇన్సెంటివ్ బకాయిలు రూ.20 కోట్ల దాకా..

పట్టురైతులకు ప్రోత్సాహకంగా కిలో గూళ్లకు ప్రభుత్వం రూ.50 అందజేస్తోంది. ఇప్పటిదాకా ఉమ్మడి జిల్లాకు సంబంధించి రైతులకు రూ.20 కోట్ల ఇన్సెంటివ్ బకాయిలు రావాల్సి ఉంది. దీనిపై రైతులు పోరాడుతూనే ఉన్నారు. అధికారులేమో కొంతమేర విడుదల అయ్యాయని, త్వరలో అందజేస్తామని చెబుతున్నారు.

చైనా సాంకేతిక పరిజ్ఞానం మనకు లేక..

ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వం ద్వారా నడిచే సిల్క్ రీలింగ్ యూనిట్లు పలమనేరు, మదనపల్లెలో మూతబడ్డాయి. ఇక ప్రైవేటు వ్యక్తుల ద్వారా సుమారు 200 చర్కాలు, 20 దాకా మల్టిండ్ రీలింగ్ యూనిట్లు(20,10,6 బేషన్స్) 65 ట్విస్టింగ్ యూనిట్లు ఉన్నాయి. సిల్క్ వీవర్స్ 3114 మంది ఉన్నారు. అయితే వీరు ప్రస్తుతం మల్టీ ఎండ్ రీలింగ్ యంత్రాలనే వాడుతున్నారు. అడ్వాన్స్ టెక్నాలజీతో రూపొందించిన ఆటోమేటిక్ రీలింగ్ యంత్రాలను చైనా వాడుతోంది. ఈ యంత్రాల్లో నాణ్యత తగ్గిన గూళ్లలోనూ దారం తీసే సామర్థ్యం ఉంది. చైనా టైప్‌లో ఏఆర్ఎంలకు ఉమ్మడి జిల్లాలోని కుప్పం, మదనపల్లెలో గతంలో ఏర్పాటు చేశారు. కానీ ఇప్పుడు సక్రమంగా నడవడం లేదు. ఇక ఎక్కువగా గూళ్లను ఉత్పత్తి చేసే పలమనేరులో దీన్ని పెట్టేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. పాత విధానం ద్వారా సిల్క్ రీలింగ్ చేస్తుండడంతో నాణ్యత తగ్గి స్థానిక రీలర్లకు నష్టాలు తప్పడం లేదు. ఇది గూళ్ల ధరలపై ప్రభావం చూపుతోంది. ఉమ్మడి జిల్లాలోని పలమనేరు, కుప్పం, మదనపల్లె పట్టుగూళ్ల విక్రయకేంద్రాల్లో గత ఐదేళ్లుగా ఏటా సగటున 1500 టన్నుల దాకా గూళ్ల ఉత్పత్తి ఉంది. దీన్ని మూడు వేల టన్నులు చేస్తామన్న ప్రభుత్వ లక్ష్యం ఇప్పటికీ నెరవేరలేదు.

సెరికల్చర్ హబ్ ఉట్టి మాటలే..

జిల్లాను ప్రపంచస్థాయి సెరికల్చర్ హబ్‌గా చేస్తామని గతంలో కిరణ్‌కుమార్ రెడ్డి ప్రభుత్వం, ఆపై చంద్రబాబు మాటిచ్చారు. ఇటీవల ఎన్నికల ప్రచారానికి వచ్చినప్పుడు సైతం చంద్రబాబు సెరికల్చర్ హబ్ చేస్తామని చెప్పారు. ఏటా ఎన్నికల సమయంలో మాత్రమే నాయకులకు ఈ మాట గుర్తుకురావడం, ఆపై మరిచిపోవడం పరిపాటిగా మారింది.



మల్బరీ పంట

నిలకడలేని పట్టుగూళ్ల ధరలు..

గత మూడేళ్లుగా పట్టుగూళ్ల ధరలు నిలకడలేవు. ప్రభుత్వ రీలింగ్ యూనిట్లు మూతబడడంతో ప్రభుత్వ అధికారులు గూళ్లను కొనడం లేదు. గతంలో ఇక్కడ గూళ్లను కొంటున్న చైనా వ్యాపారులు రావడం లేదు. దీంతో ప్రైవేటు వ్యాపారులు మాత్రమే పట్టుగూళ్లను కొంటున్నారు. వీరంతా రింగై కొనుగోళ్లు చేస్తుండడంతో ధరలు పెరగడం లేదని రైతులు వాపోతున్నారు. పోనీ కర్ణాటక నుంచి వ్యాపారులు ఇక్కడికి రావాలంటే లోకల్ వ్యాపారుల మధ్య ఇబ్బందులు ఉన్నాయి. ఆన్‌లైన్‌లో లావాదేవీలు పెద్దగా ఫలితాలు ఇవ్వడం లేదు. ప్రస్తుతం పలమనేరు ప్రభుత్వ పట్టుగూళ్ల మార్కెట్‌లో బైవోల్టిన్ కిలో గూళ్ల సగటు ధర రూ.520, సీబీ గూళ్ల ధర రూ.470గా ఉంది. కనీసం సగటు ధర రూ.550 కంటే ఎక్కువగా ఉంటేనే పట్టురైతులకు గిట్టుబాటు అవుతుంది.

సమస్యలు తప్పడం లేదు..



"గత ఐదారేళ్లుగా పట్టుగూళ్ల ధరలు మాత్రం పెరగలేదు. గతంలో పట్టు పురుగుల పెంపకానికి వచ్చే వారికి కూలి రూ.200. ఇప్పుడు మనిషికి రూ.600 ఇస్తామన్నా పనులకు రావడం లేదు. దీంతో రైతులకు కూలీల సమస్య ఎక్కువైంది. ఇంట్లో వాళ్లంతా కష్టపడేంత పనులు ఉంటాయి. కిలో గూళ్లకు రూ.50 అదనంగా ఇస్తామన్న ప్రభుత్వం అది కూడా ఇవ్వలేదు. ప్రోత్సాహకాలు అంతంత మాత్రమే.

– ఈశ్వర్‌రెడ్డి, పట్టురైతు, టీఎస్ అగ్రహారం, పలమనేరు

ఇబ్బందులు ఉన్న మాట నిజమే..



గతంలో ఆయా ఏడీల పరిధిలో పథకాల అమలయ్యేవి. ఇప్పుడు సెంట్రలైజేషన్ కారణంగా స్టేట్ యూనిట్‌గా మారింది. దీంతో అన్ని పథకాలకు నగదు విడుదల ఆలస్యమవుతోంది. ఇక ఏఆర్ఎంలు పెట్టుకోవడానికి ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ముందుకొస్తే యూనిట్‌ను మంజూరు చేసేందుకు సిద్ధంగా ఉన్నాం. కానీ ఎవరూ రావడం లేదు. ఇక రైతులకు ఇన్సెంటివ్ ఆలస్యమవుతోంది. ఈ మధ్య కొంత రిలీజ్ అయినా అది ఇంకా రైతుల ఖాతాల్లోకి పడలేదు. – కిశోర్‌నాయక్, సిరికల్చర్ ఏడీ, పలమనేరు

క్లుప్తంగా

సెల్ టవర్ ఏర్పాటుపై నిరసన



నిరసన తెలుపుతున్న చిన్న మశీదు వీధి మహిళలు

రొంపిచెర్ల: మండలకేంద్రంలోని చిన్న మశీదువీధిలో ఇళ్ల మధ్యలో గురువారం ఓ టెలికాం కంపెనీకి చెందిన సెల్‌టవర్ ఏర్పాటు చేస్తుండడంపై మహిళలు నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ తాము బీడీ పని చేసుకుని జీవిస్తున్నామని, ఇప్పటికే తమ ఆరోగ్యాలు అంతంతమాత్రం ఉన్నాయని, దీనికి తోడు ఇళ్ల మధ్య సెల్‌టవర్ ఏర్పాటు చేస్తే తాము మరింత ఇబ్బందులు పడే అవకాశం ఉందన్నారు. ఇక్కడ సెల్ టవర్ ఏర్పాటు చేయవద్దని జిల్లా కలెక్టర్ సుమిత్రకుమార్‌కు కూడా ఫిర్యాదు చేశామని తెలిపారు. అయితే రాత్రికి రాత్రే దౌర్జన్యంగా పనులు మొదలు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకుని సెల్ టవర్ పనులను నిలిపేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

నలుగురికి జైలు



బ్రీతింగ్ ఎనలైజర్‌తో టెస్ట్ చేస్తున్న పోలీసులు

గుడుపల్లె: డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన నలుగురికి కుప్పం కోర్టు జైలు శిక్షతో పాటు రూ.5 వేలు జరిమానా విధించినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. గురువారం కుప్పం-పలమనేరు జాతీయ రహదారిలోని చప్పిడిగరుగులు వద్ద రోడ్డులో పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. ఇందులో నలుగురు వాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వారిని పోలీసులు అదుపులోకి తీసుకుని కుప్పం కోర్టులో జడ్జి ముందు హాజరు పరచగా, ఒక్కొక్కరికి రూ.5 వేలు జరిమానా విధించారు. అలాగే ముగ్గురికి మూడు రోజులు, ఒకరికి మాత్రం 7 రోజులు జైలు శిక్ష విధించినట్లు ఎస్‌ఐ తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

చెరువులో పడి వృద్ధుడి మృతి



మృతి చెందిన సుబ్బరామయ్య

వెదురుకుప్పం: చేపల వేట కోసం వెళ్లిన ఓ వృద్ధుడి చెరువులో పడి మృతి చెందిన ఘటన బుధవారం మండలంలోని గొడుగుచింత సమీపంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ వెంకటసుబ్బయ్య కథనం మేరకు.. మండలంలోని దిగువపల్లాలు గ్రామానికి చెందిన రామకృష్ణారెడ్డి, నరసింహారెడ్డి, మహేష్‌తో పాటు ఎస్టీకాలనీకి చెందిన సుబ్బరామయ్య బుధవారం సాయంత్రం గొడుగుచింత గ్రామానికి సమీపంలో ఉన్న రంగారెడ్డి చెరువులోకి చేపల కోసం దిగారు. అయితే సుబ్బరామయ్యకు ఈత రాకపోవడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. చేపల కోసం వెళ్లిన వారిలో ఒకరైన మహేష్ ఈ విషయాన్ని గురువారం కుటుంబ సభ్యులకు విషయాన్ని తెలియజేశాడు. వారు వెంటనే చెరువు వద్దకు వెళ్లి పరిశీలించగా అప్పటికే శవమై తేలాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి శవాన్ని పుత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ చెప్పారు. మృతుడు సుబ్బరామయ్య గత 5 ఏళ్లుగా మహేష్‌కు చెందిన మామిడి తోటకు కాపలా ఉన్నట్లు దర్యాప్తులో తేలింది.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి



ఘటనా స్థలంలో మృతి చెందిన నాగ

ఐరాల: రోడ్డు ప్రమాదంలో ఓ విద్యార్థి మృతి చెందిన సంఘటన మండలంలోని అగరంపల్లె సమీపంలోని పెట్రోల్ బంకు వద్ద గురువారం రాత్రి చోటుచేసుకుంది. కాణిపాకం ఎస్‌ఐ ధరణిధర కథనం మేరకు.. తవణంపల్లె మండలం సరకల్లు సమీపంలోని ఓ గ్రామానికి చెందిన చిరంజీవి కుమారుడు నాగ(15) ఓ ప్రైవేటు స్కూల్‌లో చదువుతున్నాడు. గురువారం సాయంత్రం స్కూల్ వదిలిన తరువాత నాగ తన స్కూటీలో ఐరాల మండలం 45 కొత్తపల్లెకు చెందిన తన స్నేహితున్ని ఇంటి దగ్గర వదిలి గ్రామానికి బయలుదేరాడు. ఈ క్రమంలో అగరంపల్లె సమీపంలోని పెట్రోల్ బంకు వద్ద ముందు వెళ్తున్న బైక్‌ను ఓవర్‌టేక్ చేసే క్రమంలో అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న బోర్డుకు ఢీకొని, అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి చిరంజీవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ చెప్పారు.

హైకోర్టు ఆదేశించినా..
అధికారులు కరుణించరా..!

రొంపిచెర్ల: హైకోర్టు ఆదేశించినా తమను విధుల్లోకి తీసుకోలేదని సంఘమిత్రలు రొంపిచెర్ల స్త్రీశక్తి భవనం ముందు గురువారం నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఎలాంటి తప్పు లేకున్నా తమను అన్యాయంగా తొలగించడంపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని తెలిపారు. అయినా న్యాయం జరగకపోవడంతో హైకోర్టుకు వెళ్లామన్నారు. తప్పు లేకుండా సంఘమిత్రలను ఎలా తొలగిస్తారని, యథావిధిగా విధుల్లోకి కొనసాగించాలని హైకోర్టు ఆదేశించినా న్యాయం జరగడం లేదని వాపోయారు. పది రోజులుగా కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా అధికారులు కరుణించడం లేదన్నారు. రొంపిచెర్ల మండలంలో 14 మంది సంఘమిత్రలను తొలగించారని, తమను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని లేనిపక్షంలో జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘమిత్రలు గీత, రష్యా బేగం, ప్రమీల, ఉదయభాను, ధనలక్ష్మి, గీతా రాణి, సుబ్బరత్న తదితరులు పాల్గొన్నారు.

రుణాల మంజూరులో అలసత్వం వద్దు

- అర్హులకు పీఎం విశ్వకర్మ రుణాలు మంజూరు చేయండి
- బ్యాంకర్లతో కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలో పీఎం విశ్వకర్మ యోజనా పథకం లబ్ధిదారులకు రుణాలు మంజూరు చేయడంలో బ్యాంకర్లు అలసత్వం వహించకూడదని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ హెచ్చరించారు. గురువారం కలెక్టరేట్‌లో పీఎం విశ్వకర్మ యోజన పథకం అమలుపై సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం పీఎం విశ్వకర్మ పథకాన్ని ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందన్నారు. ఈ పథకంలో అర్హులకు న్యాయం చేయాలని, వారికి 5 శాతం వడ్డీకి రూ.3 లక్షల రుణం అందిస్తారన్నారు. సంప్రదాయ పని ముట్లను, చేతివృత్తులను ఉపయోగించి పనిచేసే కళాకారుల వృత్తులను బలోపేతం చేసేందుకు పథకం అమలు చేస్తున్నారన్నారు. చేతివృత్తులు, కళాకారులు చేసే ఉత్పత్తుల నాణ్యతను పెంచి దేశీయ, గ్లోబల్ మార్కెట్‌తో అనుసంధానం చేయడం జరుగుతుందని తెలిపారు. పథకంలో అర్హులైన వారికి 5 శాతం వడ్డీతో తొలి విడత రూ.1 లక్ష, రెండవ విడతలో రూ.2 లక్షల వరకు రుణం అందిస్తారన్నారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో అర్హులైన లబ్ధిదారులకు రుణాలు ఇవ్వడంలో బ్యాంకర్లు అలసత్వం వహిస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ రవి కుమార్ నాయుడు, మెప్మా పీడీ రాధమ్మ, ఎల్‌డీఎం హరీష్, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి గుణశేఖర్‌రెడ్డి, డీఐసీ జీఎం చంద్రశేఖర్ తదితర బ్యాంక్ అధికారులు పాల్గొన్నారు.

వంకలో రోడ్డు ఎలా వేస్తారు?

- వంకలో రోడ్డు వేస్తే వర్షపు నీరు ఎలా వెళ్తుంది ?
- ఉన్నతాధికారులైనా స్పందించి న్యాయం చేయండి
- రోడ్డు పనులను అడ్డుకున్న మాంబేడు గ్రామస్తులు



వంకలో రోడ్డు నిర్మాణాన్ని అడ్డుకుంటున్న మహిళలు

వెదురుకుప్పం: వంకలో రోడ్డు ఎలా వేస్తారని గ్రామస్తులు అడ్డుకున్న సంఘటన మండలంలో వెలుగు చూసింది. వివరాలు.. మండలంలోని మాంబేడు గ్రామ సమీపంలో అధికారులు రోడ్డు వేసేందుకు సిద్ధం కాగా స్థానిక రైతులు, గ్రామస్తులు అడ్డుకున్నారు. అయితే ఇదే విషయమై మాంబేడు గ్రామంలో గత కొద్ది రోజులుగా వివాదాస్పదంగా మారింది.

కాలువను పూడ్చి వేసి..

మాంబేడు గ్రామానికి చెందిన కొంతమందికి కొత్త చెరువు సమీపంలో పొలాలు ఉన్నాయి. ఆ పొలాల వద్దకు వెళ్లాలంటే వంకలో నుంచే వెళ్లాలి. గతంలో పొలాల వద్దకు వెళ్లేందుకు కొత్తగా రోడ్డు నిర్మాణం కూడా చేపట్టినట్లు గ్రామస్తులు చెబుతున్నారు. కానీ ఇప్పుడు వంకలో రోడ్డు ఎలా వేస్తారని ప్రశ్నిస్తున్నారు. గతంలో కూడా ఇదే విషయమై జిల్లా అధికారులకు కొందరు ఫిర్యాదు చేశారు. దీంతో ఇటీవల డిప్యూటీ కలెక్టర్ వచ్చి స్థల పరిశీలన చేశారు. వంకకు ఇరువైపులా ఉన్న రైతులతో మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వంకలో రోడ్డు వేయడం వల్ల అనేక ఇబ్బందులు తలెత్తుతాయని రైతులు తేల్చి చెప్పారు. ఇదిలా ఉండగా బుధవారం రెవెన్యూ అధికారులు, పోలీసులు గ్రామానికి వెళ్లి జేసీబీ సాయంతో చెట్లను తొలగించి, పెద్దపెద్ద రాళ్లు వేసి పూడ్చి వేశారు. ఇది తెలిసి స్థానిక మహిళలు, రైతులు అడ్డుకున్నారు. వంకను పూడ్చితే వర్షం పడినప్పుడు వరదనీరు తమ పొలాలపైకి వస్తుందంటూ నిరసన వ్యక్తం చేశారు. వంక లేకపోతే వర్షపు నీరు ఎలా ప్రవహిస్తోందని అధికారులను ప్రశ్నించారు.

టీకేఎంపురం చెరువుకు నీటి ప్రవాహం అంతేనా ?

మాంబేడు గ్రామానికి సుమారు 2 కిలోమీటర్ల దూరంలో ఉన్న కొత్త చెరువు వర్షాలకు నిండి మొరవ పారుతుంది. కొత్త చెరువుతో పాటు అటవీ ప్రాంతాల నుంచి కూడా ప్రస్తుతం రోడ్డు వేస్తున్న వంకలో నీరు ప్రవహించి టీకేఎంపురం చెరువుకు వరద నీరు చేరుతుంది. అదేవిధంగా అగ్గార్లవంక, కాట్రాళ్లవంక నుంచి కూడా మాంబేడు వంకలోకి నీరు చేరి టీకేఎంపురం చెరువులోకి పోతుంది. ఈ చెరువులో నీరు పుష్కలంగా ఉంటే మాంబేడు, టీకేఎంపురం, పచ్చికాపల్లం పంచాయతీల్లో సుమారు 500 ఎకరాల వరకు పంటల సాగుకు అనుకూలంగా ఉంటుందని రైతులు చెబుతున్నారు.

రోడ్డు వేసినా నిష్ప్రయోజనమే..!

వంకలో రోడ్డు వేస్తే వర్షాలకు కొట్టుకుపోవడం తప్పితే ఎవరికీ ప్రయోజనం ఉండదని స్థానిక రైతులు చెబుతున్నారు. రోడ్డు వేస్తే వర్షపు నీరు పొలాలపైకి వచ్చి పంటలు కొట్టుకుపోతాయని వాపోతున్నారు. ఒకవేళ రోడ్డు వేసినా నీటి ప్రవాహానికి కొట్టుకుపోదని గ్యారెంటీ ఏంటని ప్రశ్నిస్తున్నారు.

ఆత్మహత్యే శరణ్యం..!



"వంకను పూడ్చి రోడ్డు వేయడం ద్వారా మా పంట పొలాలు నాశనం అవుతాయి. వరదలు వస్తే మా పొలాల్లోకి వరద నీరు చేరి సాగుకు అనుకూలంగా ఉండదు. అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదు. మాకు న్యాయం చేయకపోతే ఆత్మహత్యే శరణ్యం.

– శాంతమ్మ, మాంబేడు

వంకలు లేకపోతే ఎలా..?



మా పంట పొలాలు మునిగిపోతాయని చెప్పినా వినిపించుకోకుండా ఒరవ కాలువను పూడ్చి వేస్తున్నారు. రెండు కాలువలు కలిపి ఈ వంకలో పారుతాయి. వరద ఉధృతికి వర్షపు నీరు పొంగి పొర్లుతుంది. వంకను పూడ్చి వేస్తుండడంతో వర్షపునీరు మా పొలాల్లోకి ప్రవహించి పంటల సాగుకు ఆటంకం కలిగిస్తోంది. అధికారులు మాకు న్యాయం చేయాలి.

– మునెమ్మ, మహిళా రైతు

పెండింగ్ బిల్లుల చెల్లింపునకు చర్యలు

– జెడ్పీ సీఈఓ రవికుమార్‌నాయుడు



చిత్తూరు కార్పొరేషన్: జిల్లా పరిషత్ పరిధిలో ఐదేళ్ల ముందు చేసిన పనులకు సంబంధించి బిల్లుల చెల్లింపునకు చర్యలు తీసుకుంటున్నట్లు సీఈఓ రవికుమార్‌నాయుడు తెలిపారు. గురువారం ఆయన సీఈఓ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. గతంలో సీఎం చంద్రబాబు పాలనలో చేసిన 402 పనులకుగాను రూ.7 కోట్లు బిల్లులు ఇవ్వాల్సి ఉందన్నారు. వాటిని చెల్లించాలని ప్రభుత్వం ఆదేశించిందని, ఇప్పటి వరకు 60 పనులకు సంబంధించిన బిల్లులు చెల్లించినట్లు తెలిపారు. మిగిలిన వాటిని అప్‌లోడ్ చేసే పనిలో సిబ్బంది ఉన్నారని, ఈ నెలలోపు వాటిని చెల్లించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. మండల పరిషత్, గ్రామ సచివాలయాల్లో రికార్డులు సక్రమంగా నిర్వహించాలని, ఇటీవల పులిచెర్ల, పలమనేరు, గంగవరం, విజయపురం, పెనుమూరు మండలాల్లో మండలపరిషత్, గ్రామ సచివాలయాలు, అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశామన్నారు. అదేవిధంగా జెడ్పీ పాఠశాలలు, అక్కడ అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకాన్ని తనిఖీ చేయనున్నట్లు పేర్కొన్నారు. విధి నిర్వహణలో తప్పుచేసిన వారిని ఉపేక్షించే ప్రసక్తిలేదని స్పష్టం చేశారు. ఎంపీడీఓలు వారి పరిధిలో ఉన్న కార్యాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేసి నివేదికలు అందజేయాలని కోరారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

పుంగనూరు: కుటుంబ కలహాలతో ఓ మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన పట్టణంలో వెలుగు చూసింది. గురువారం స్థానిక ఏరియా ఆస్పత్రిలో పనిచేసే టెక్నీషియన్ తులసి కుటుంబ కలహాలతో మనస్తాపానికి గురై ఇంటిలో యాసిడ్ తాగింది. గమనించిన భర్త వెంటనే స్థానిక ఆస్పత్రికి తరలించి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం మదనపల్లె ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.